ఆగని మోటార్ల చోరీలు

- పొలాల్లో బోరు మోటార్లు ఎత్తుకెళ్తున్న దొంగలు
- నీటి తడులు అందక పంటలు ఎండిపోయే ప్రమాదం
- ఆందోళనలో రైతులు


ధ్వంసం చేసిన స్టార్టర్


బోరు మోటార్ చోరీకి గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రైతు పరమేశ్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని భీంసరి శివారు గల పొలాల్లో బోరు మోటార్లు వరుసగా చోరీకి గురవుతున్నాయి. రైతులు యాసంగిలో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. వాగుల్లో ఏర్పాటు చేసుకున్న బోరు మోటార్ల ద్వారా పంటలకు నీటిని అందిస్తున్నారు. గుర్తుతెలియని దొంగలు రాత్రి సమయంలో వీటిని ఎత్తుకెళ్తున్నారు. దీంతో నీటి తడులు లేక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మూడు నెలల్లో..

వానాకాలంలో పంటల దిగుబడి రాక నీటి సౌకర్యం ఉన్న కొందరు రైతులు యాసంగిలో వివిధ పంటలు సాగు చేశారు. నీటి తడులు ఇచ్చేందుకు సమీపంలోని వాగుల్లో బోరు మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. భీంసరి గ్రామానికి చెందిన చిలుక రమేశ్‌కు ఆరు ఎకరాల పొలం ఉంది. యాసంగిలో జొన్న సాగు చేయగా నీటి తడి ఇచ్చేందుకు సమీపంలోని వాగులో బిగించిన బోరు మోటార్ మూడు నెలల క్రితం చోరీకి గురైంది. ఈనెల 23న మరొకటిని, మరో ఇద్దరి బోరు మోటార్లు ఎత్తుకెళ్లారు. మూడు నెలలో రెండేసి బోరు మోటార్లు చోరీకి గురికావడంతో గ్రామానికి చెందిన పలువురు రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటివరకు అవి రికవరీ లేకపోవడం, మళ్లీ కొత్త మోటార్లు బిగించుకుంటే ఉంటాయే ఎత్తుకెళ్తారోనని వారిలో ఆందోళన ఉంది.

ఫిర్యాదు చేశాం

యాసంగిలో జొన్న సాగు చేస్తున్నా. వాగులో బోరు మోటారు ఏర్పాటు చేసుకుని పంటకు నీటి తడి ఇస్తున్నా. గత శనివారం బోరు మోటార్‌ను, మూడు నెలలో రెండు చొప్పున ఎత్తుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు రికవరీ లేదు.

– చిలుక పరమేశ్, రైతు, భీంసరి

త్వరలో పట్టుకుంటాం

భీంసరి వాగులో ఏర్పాటు చేసుకున్న బోరు మోటార్ల చోరీపై విచారణ చేస్తున్నాం. త్వరలో దొంగలను పట్టుకుంటాం. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే సమాచారం అందించాలి.

– ముజాహిద్, ఎస్సై, ఆదిలాబాద్ రూరల్

అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలు

తాంసి: గ్రామాల్లో కురుస్తున్న అకాల వర్షాలకు పంటలకు నష్టం వాటిల్లింది. మండలంలోని హస్నాపూర్, పొన్నారి గ్రామాల శివారులో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి పంటలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. చేతికందే దశలో ఉన్న జొన్న, నువ్వు, పెసరి తదితర పంటలు నేలకొరగడంతో రైతులు లబోదిబోమంటున్నారు.


పొన్నారి శివారులో నేలకొరిగిన జొన్న

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన ఇంద్రజిత్ జాతీయ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన 8వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో జట్టు తృతీయ స్థానంలో నిలవడంలో కీలకపాత్ర వహించిన ఇంద్రజిత్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై నట్లు పీఈటీ రూపేష్ తెలిపారు. విద్యాసంస్థ జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ క్రాంతికుమార్ ఉపాధ్యాయులు అతన్ని అభినందించారు.


ఇంద్రజిత్

వంతెన లేక ఇక్కట్లు

బేల: మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలోని రాయపూర్(కె) గ్రామానికి వెళ్లే దారిలో వాగుపై వంతెన లేక ఆదివాసీలు ఇక్కట్లు పడుతున్నారు. వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. వంతెన మంజూరు చేసి నిర్మించేలా చర్యలు చేపట్టాలని ప్రజాప్రతినిధులు, అధికారులను కోరుతున్నారు.



క్లుప్తంగా

ధ్యానంతోనే ప్రశాంతత


మాట్లాడుతున్న అడ్డి భోజారెడ్డి

బేల: ప్రతి ఒక్కరూ ధ్యానం చేయడంతో ప్రశాంతత లభిస్తుందని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అవాల్‌పూర్ గ్రామంలో మంగళవారం ఆధ్యాత్మిక గురువు పూలాజీబాబా ధ్యానమందిరం 4వ వార్షికోత్సవ మహోత్సవానికి ఆయన హాజరయ్యారు. నూతనంగా నిర్మించిన ధ్యానమందిరం భవనాన్ని శ్రీ సిద్ధేశ్వర్ సంస్థాన్ పట్నాపూర్ అధ్యక్షుడు కేశవ్ ఇంగులేతో కలిసి ఆయన ప్రారంభించారు. జూనోని ధ్యానకేంద్రం అధ్యక్షుడు గుర్నులే సురేష్, ఎంపీటీసీ నగేశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మినక పుష్పలత సుధాంరెడ్డి, గ్రామస్తులు తిరుపతి, విజేందర్‌రెడ్డి, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

‘బీజేపీని ఓడించాలి’


మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

తాంసి: దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల నాయకులతో కలిసి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల హామీలు నెరవేర్చకుండా బీజేపీ ప్రజలను మోసం చేసిందన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ నాయకుడు గోపాల్‌ను పరామర్శించారు. జిల్లా నాయకుడు కుంటాల రాములు, నాయకులు రతన్, అశోక్, దేవిదాస్, అర్జున్ తదితరులు ఉన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలి


నర్సరీ పరిశీలిస్తున్న ఎంపీడీవో మోహన్‌రెడ్డి

తాంసి: మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో మోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని అంబుగాం గ్రామంలో నర్సరీని మంగళవారం పరిశీలించారు. నర్సరీలో మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎండ తీవ్రత ఉన్నందున మొక్కలకు షెడ్‌నెట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఉదయం , సాయంత్రం సమయంలో మొక్కలకు నీటిని అందించాలని కార్యదర్శికి సూచించారు. అనంతరం సెగ్రిగేషన్ షెడ్డులో సేంద్రియ ఎరువుల తయారీని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి మేఘరాజ్, ఫీల్డ్ అసిస్టెంట్ యశ్వంత్, గ్రామపెద్దలు భారత్, పోచ్చిరాం ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న సామ రూపేష్‌రెడ్డి

బేల: రోడ్డు సౌకర్యంతోపాటు ఇతరత్రా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలోని తలాయిగూడ గ్రామాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఆదివాసీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సమస్యలను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. నాయకులు రమేశ్ పటేల్, కన్య రాజు, దోటే ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని కొనసాగించాలి

నేరడిగొండ: అంగన్‌వాడీ కేంద్రాన్ని తమ గ్రామంలోనే కొనసాగించాలని సవర్గాం గ్రామస్తులు కోరారు. మంగళవారం సూపర్‌వైజర్ మంజులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా అంగన్‌వాడీ కేంద్రం గ్రామంలో కొనసాగుతుందని తెలిపారు. తమకు ఎలాంటి సమాచారం లేకుండా రోడ్‌సవర్గాంకు తరలించినట్లు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఇదివరకు కేంద్రంలో 11 మంది చిన్నారులు ఉన్నారని అన్నారు. పేదలకు పౌష్టికాహారం, పిల్లలకు నాణ్యమైన విద్య అందేలా చూడాలని కోరారు. గ్రామస్తులు జాదవ్ భీమ్‌రావు, రమేశ్, మద్దెల స్వామి తదితరులు ఉన్నారు.

అన్నిదానాల్లో కెల్లా అన్నదానం గొప్పది

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం వద్ద మంగళవారం ఇస్కాన్, పాయల్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో ఏర్పాటు ఏర్పాటు చేసిన రూ.5 భోజన కేంద్రాన్ని మఠాధిపతి శ్రీశ్రీశ్రీ యోగానంద సరస్వతి స్వామితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నదానాన్ని చేయడం గొప్ప విషయం అన్నారు. నిరుపేదలు కూలీలు, జిల్లా కేంద్రానికి వచ్చే రైతులను దృష్టిలో పెట్టుకుని రూ.5లకే భోజనాన్ని ఏర్పాటు చేశారన్నారు. మిగతా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముందుకు రావాలన్నారు. వివిధ మార్కెట్ యార్డుల్లో భోజనాల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఇస్కాన్ సంస్థ నిర్వాహకులు, బీజేపీ నాయకులు పాయల్ శరత్, రాజేష్, విజయ్, రాజశేఖర్, సాయి, అర్జున్ పాల్గొన్నారు.


వడ్డిస్తున్న ఎమ్మెల్యే పాయల్

టీయూడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్


ఆదిలాబాద్: ఇఫ్తార్‌లో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, తదితరులు


ఉట్నూర్‌రూరల్: ఇఫ్తార్‌లో పాల్గొన్న జయచంద్ర, ముస్లిం సోదరులు

ఆదిలాబాద్: తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి ఉపవాస దీక్ష విరమించారు. ఇఫ్తార్‌లో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీయూడబ్ల్యూజేఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షాహిద్ అహ్మద్, ఖాజిర్ అహ్మద్, పలువురు అధికారులు, రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్ మండలంలో..

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లక్కారం గ్రామంలోని అక్సా మసీద్‌లో యువ నాయకుడు జయచంద్ర ఆధ్వర్యంలో మైనార్టీలకు మంగళవారం ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఖయ్యూం, నాయకులు నిసార్, ప్రజా సంఘాల నాయకులు ఆత్రం భుజంగ్‌రావు, అజ్మీర నరేశ్, సలీం తదితరులు పాల్గొన్నారు. కలీం మౌలానా, ఉస్మాన్, సాజిద్‌ఖాన్, అలీం, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకా

సాక్షి స్పందన

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అసోదా గ్రామ పంచాయతీ పరిధి పూనగూడ గ్రామంలో పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడ్డాయి. దీంతో వాటికి చికిత్స అందించలేని దుస్థితిని వివరిస్తూ ‘పశువులకు అందని వైద్యం’ శీర్షికన మంగళవారం ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. స్పందించిన పశు వైద్యాధికారులు గ్రామానికి వెళ్లి పశువులకు గాలికుంటు నివారణ టీకా వేయడంతోపాటు చికిత్స అందజేశారు.


టీకా వేస్తున్న పశువైద్యాధికారులు

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

ఇచ్చోడ: ప్రైవేట్ వాహనాల్లో కన్నా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం సురక్షితమని ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్‌లో మంగళవారం రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికులు జాగ్రతలు తీసుకోవాలన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు. అనంతరం ఆర్టీసీ గమ్యం యాప్ గురించి ప్రయాణికులకు వివరించారు. ఆర్టీసీ విలేజ్ ఆఫీసర్ సతీశ్, సిబ్బంది యూసుఫ్ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న కల్పన

ప్రకృతితో స్నేహం చేద్దాం

బోథ్: ప్రతి విద్యార్థి ప్రకృతితో స్నేహం చేయాలని పక్షి ప్రేమికుడు జక్కుల వెంకటేశ్ అన్నారు. మండల కేంద్రంలోని నాగభూషణం పాఠశాల, పార్డి గ్రామంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో మంగళవారం ప్రకృతితో స్నేహం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రతి ఇంట్లో నీటి తొట్టెలు, బర్డ్ ఫీడర్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సేవ్ బర్డ్స్–సేవ్ నేచర్ ప్రతిజ్ఞ చేయించారు. ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం భూమన్న, నాగభూషణం పాఠశాల హెచ్‌ఎం కిశోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసు విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పోలీసు విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై లాల్‌సింగ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని బసవేశ్వర చౌక్‌లో వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు మంగళవారం డ్రంకెన్ డ్రైవ్ చేపట్టారు. భుక్తాపూర్‌కు చెందిన వికుల్ కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించడంతోపాటు విధులకు ఆటంకం కలిగించాడు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు వికుల్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

అదనపు భత్యం లేనట్టేనా..?


గుండాలలో ఉపాధి కూలీలు

- ప్రభుత్వం నుంచి రాని ప్రకటన
- నిరాశలో ఉపాధి కూలీలు

నార్నూర్: వలసల నివారణ కూలీలకు పని కల్పించడమే లక్ష్యంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఏటా ఇచ్చే కూలికి అదనంగా వేసవిలో ప్రత్యేకంగా అదనపు భత్యం మంజూరు చేసేవారు. అయితే గతేడాది అమలు చేయలేదు. ఈ ఏడాదైనా వస్తుందనుకుంటే మార్చి మూడో వారం వచ్చిన ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. దీంతో ఉపాధి కూలీలలో నిరాశ కనిపిస్తోంది. సాధారణంగా వేసవి నేపథ్యంలో ఎండల తీవ్రత నేల స్వభావం గట్టిగా ఉండడంతో చేసిన పనికి అదనంగా భత్యం ఇవ్వడం ద్వారా కూలీలకు కొంత అదనంగా డబ్బు సమకూర్చేది. మార్చి, ఏప్రిల్, మే నెలలో 30 శాతం, జూన్ లో 20 శాతం చొప్పున కూలీల వేతనానికి అదనంగా వేసవి భత్యం చెల్లించేవారు. అలాగే తాగునీటి కోసం ఒక్కో కూలీకి రూ.5 చొప్పున బిల్లులు ఇచ్చేవారు. ఈవిధంగా ప్రస్తుత వేసవిలో ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో కూలీ గిట్టుబాటు కాదని ఉపాధి పనులకు వెళ్లేవారు వాపోతున్నారు.

నార్నూర్, గాదిగూడ మండలాల్లో..

నార్నూర్ మండలంలో మొత్తం 23 పంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించడం కోసం మండల వ్యాప్తంగా 7250 జాబ్ కార్డులు ఉన్నాయి. 14,385 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. గాదిగూడ మండలంలో 25 పంచాయతీలు ఉన్నాయి. మండల వ్యాప్తంగా 4956 జాబ్ కార్డులు ఉన్నాయి. 11596 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. మార్చి నుంచి జూన్ వరకు ఆయా మండలాల్లో 70 శాతం మేర కూలీలు ఉపాధి పనులకు వెళ్తుంటారు. గత ఆర్థిక సంవత్సరం 7.25 లక్షలు పని దినాలు కల్పించగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి 7.25 లక్షలు పని దినాలే లక్ష్యంగా ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.272 కూలీ డబ్బులు చెల్లించేందుకు అవకాశం ఉన్నా, సగటున వస్తున్న కూలి మాత్రం రూ.200 లోపే వస్తోంది. ఇలాంటి నేపథ్యంలో వేసవి భత్యం నాలుగు నెలలపాటు ఇవ్వడం ద్వారా ఆ కూలీలకు ఎంతో మేలు జరిగేదని, ఇవ్వకపోవడం ద్వారా కూలి సరిపడక ఇబ్బందులు పడుతున్నారు.

ఆదేశాలు వస్తే అమలు



గతంలో రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో సాఫ్ట్‌వేర్ ఉండడం వల్ల అదనపు భత్యం కేటాయింపులు జరి గేవి. ప్రస్తుతం కొత్త సాఫ్ట్‌వేర్ నిర్వహణ అంతా కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంది. వేసవి భత్యంపై ఎలాంటి ప్రకటన రాలేదు. ప్రస్తుతం కూలీలకు వంద రోజుల పని కల్పించడంతోపాటు గిట్టుబా టు కల్పించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. ఉన్నతా ధికారుల నుంచి ఆదేశాలు వస్తే అమలు చేస్తాం.

– సురేశ్, ఏపీవో నార్నూర్



శిథిలావస్థలో లోలెవల్ వంతెన

బేల: మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలోని సైద్‌పూర్ గ్రామంలో ఏళ్ల క్రితం నాటి లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరింది. కూలిపోయే స్థితిలో ఉందని స్థానికులు అంటున్నారు. వంతెనకు రెండువైపులా రోడ్డు భాగం సైతం కోతకు గురై ప్రమాదకరంగా మారింది. వర్షాకాలంలో ఈ వంతెనపై భారీగా వరద ప్రవాహం ఉంటుందని, గంటల తరబడి రాకపోకలు బంద్ అవుతాయని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పెద్దమ్మతల్లికి బోనాలు

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామంలో మంగళవారం పెద్దమ్మతల్లికి మహిళలు బోనాలు సమర్పించారు. 200 మంది నెత్తిన బోనాలు పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోనాలు సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు.


నెత్తిన బోనాలతో వెళ్తున్న మహిళలు

పోడు భూములకు పట్టాలివ్వాలి

ఆదిలాబాద్‌రూరల్: కుమురం భీం జిల్లా సిర్పూర్(టి) మండలంలోని ఇటికల్‌పహాడ్ గ్రామంలో గ్రామస్తులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలివ్వాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పూలే గెస్ట్‌హౌస్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 40 ఏళ్లుగా పోడు సాగు చేసుకుంటూ గ్రామస్తులు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అటవీ అధికారులు వారిని వెళ్లిపోవాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఆ ప్రాంతంలో మొక్కలు నాటుతామని చెప్పడం సరికాదన్నారు.

స్త్రీనిధి బకాయిలు చెల్లించాలి

బోథ్: స్త్రీనిధి ద్వారా స్వయం సహాయక సంఘాలు తీసుకున్న రుణాలు ఈనెల 30లోపు చెల్లించాలని స్త్రీనిధి రీజినల్ మేనేజర్ పూర్ణచంద్ అన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం స్వయం సహాయక సంఘాలతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 5 వేల స్వయం సహాయక సంఘాలకు చెందిన సభ్యులు దాదాపు రూ.15 కోట్ల రుణాలను చెల్లించాల్సి ఉందని అన్నారు. సమావేశంలో ఏపీఎం మాధవ, సీసీవో గంగాధర్, సీసీ విజయలక్ష్మి, గంగాధర్, శకుంతల, అశోక్, సర్వేశ్వర్ పాల్గొన్నారు.

‘రైతు నేస్తం’ ప్రత్యక్ష ప్రసారం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు రైతు నేస్తం ప్రత్యక్ష ప్రసారం కార్యక్రమం కొనసాగింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు పలు సూచనలు చేశారు. సమగ్ర వ్యవసాయంపై అఖిల భారత సమగ్ర వ్యవసాయ పద్ధతుల పరిశోధన విభాగం రాజేంద్రనగర్ ప్రధాన శాస్త్రవేత్త గోవర్దన్, డ్రోన్లతో వ్యవసాయం అంశంపై కీటకశాస్త్రం వరి పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త రామగోపాల వర్మ వివరించారు. ఏవో జాదవ్ కైలాస్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణానికి చెందిన క్రిస్టియన్ పలువురు కమ్యూనిటీ నాయకులు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. స్థానిక ప్రజాసేవ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో క్రిస్టియన్ కమ్యూనిటీ మహిళా అధ్యక్షురాలు ఆలం రూప రోసిన్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి వారికి కండువాలు కప్పారు.

‘ఉపాధ్యాయుడిపై చర్య తీసుకోవాలి’

ఎదులాపురం: తలమడుగు మండలం బరంపూర్ జెడ్పీఎస్ఎస్ ఎస్ఏ ఉపాధ్యాయుడు మహేందర్‌పై శాఖపరంగా చర్య తీసుకోవాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ విషయమై జిల్లాకేంద్రంలో డీఈవో ప్రణీతకు మంగళవారం వినతిపత్రం అందించారు. విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా విదేశాలకు వెళ్లిన సదరు ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు.